

మల్కాజిగిరి సర్కిల్ సఫిల్‌గూడ వద్ద ఎస్‌టీపీ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

# చెరువుల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు

**● మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, డిసెంబర్ 29: చెరువుల్లో నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి సర్కిల్ సఫిల్‌గూడ వద్ద ఉన్న ఎస్‌టీపీ ప్లాంట్ పనితీరును ఎమ్మెల్యే మర్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ఏఓసీ నుంచి వస్తున్న మురికినీటితో పాటు వరద నీరు రామకృష్ణాపురం చెరువులో కలుస్తుందని, ఇప్పటికే మురుగు నీరు చెరువులో కలువకుండా పైపులైన్ దార్వా కిందకి పంపిస్తున్నామన్నారు. సఫిల్‌గూడ వద్ద ఉన్న ఎస్‌టీపీ ప్లాంట్ ద్వారా మురుగు నీటిని శుద్ధిచేసి బండ చెరువు వైపు మళ్లిస్తున్నామన్నారు. ఇప్పుడున్న ఎస్‌టీపీ ప్లాంట్ సామర్థ్యాని పెంచడానికి అవకాశం ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ సీజీఎం సుజాత, జీఎం సునీల్, డీజీఎం నరహరి, మేనేజర్ వేణుగోపాల్, మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, బద్దం పరశురాం రెడ్డి, మురుగేశ్, అంజయ్యా, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

☛ మౌలాలి డివిజన్ ఓల్డ్ సఫిల్‌గూడలోని 'రాక్ చర్చి'లో క్రైస్తవులకు క్రిస్మస్ గిఫ్ట్‌లను ఎమ్మెల్యే మర్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఆనంద్, కార్పొరేటర్ సునీత యాదవ్, ఆనంద్‌కుమార్, సాల్మన్, ప్రభుప్రసాద్, నితీశ్‌కుమార్ పాల్గొన్నారు.

☛ బస్తీ దవాఖానలతో ఏర్పాటుతో పేదలకు ఇంటివద్దే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి ఉన్నాయని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ ఇందిరానగర్ బస్తీలో బస్తీ దవాఖానను ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం సేవల కోసం బస్తీ దవాఖానలు ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ఆనంద్, కార్పొరేటర్ సబితాకిశోర్, డాక్టర్ ప్రసన్న, అనిల్‌కిశోర్, సయ్యద్ మోసిన్, పరమేశ్, సంతోశ్, దేవయ్య గౌడ్, మురళీగౌడ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



కాప్రా సర్కిల్ కాపు కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ప్రతినిధులు

# ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

**● అన్నివర్గాల సంక్షేమానికి కృషి: ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి**

చర్లపల్లి/రామంతాపూర్/మల్లాపూర్, డిసెంబర్ 29: అన్ని వర్గాల సంక్షేమానికి తన వంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కాప్రా సర్కిల్ 'కాపు కులాల ఐక్య వేదిక' అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కాపు కులస్థులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిసి కాపుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో కాపు కులాల ఐక్య వేదికకు స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాపు కులాల ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు దేవరకొండ శ్రీనివాస్, కోశాధికారి నాగు, ప్రతినిధులు జీవీఎన్.రావు, నానాజీ, ఎల్‌కే. నాయుడు, పులి సత్యనారాయణ, కొల్లా రామారావు, ఉంగరాల నాయుడు, జయరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

☛ మీర్‌పేట్ హెచ్‌బికాలనీ డివిజన్ రాజీవ్‌నగర్‌కు చెందిన జి.రాజ్‌కుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన లక్ష రూపాయం ఎల్‌వోసీ పత్రాన్ని శుక్రవారం బాధితుడికి మీర్‌పేట్ హెచ్‌బికాలనీ కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ సమక్షంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బద్రుద్దీన్, సాయిజెన్ శేఖర్, నవీన్ గౌడ్, కృష్ణగౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

☛ విద్యారంగంలో సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేయనున్నట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కొరుతూ ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రాథోడ్ సంతోశ్, మేడ్చల్ జిల్లా కమిటి సభ్యులు శ్యామ్‌రావు, అరుణ్, అనిల్, మనీశ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

☛ విద్యార్థులు విద్యతోపాటు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రామంతాపూర్‌లోని 'చైతన్య భారతి ప్లే హై స్కూల్'లో టాలెంట్ ఎగ్జి బిషన్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన పలు రకాల ఎగ్జిబిట్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాంనర్సయ్య, బీఆర్‌ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు, లలితా, రమేశ్, సర్వబాబు యాదవ్, జహంగీర్, పవన్‌కుమార్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు క్రీడాదుస్తులను అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## యువత క్రీడల్లో రాణించాలి

మల్కాజిగిరి, డిసెంబర్ 29: యువత విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. శుక్రవారం బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో '10వ మాస్టర్ అథ్లెటిక్ స్టేట్ చాంపియన్ షిప్' పోటీల్లో పాల్గొంటున్న అథ్లెట్‌లకు ఎమ్మెల్యే మర్రి క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహిస్తామని, స్టేట్ చాంపియన్ షిప్‌లో జిల్లా పేరు నిలబెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్టర్ అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్షుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి, సలహాదారు అంజిరెడ్డి, పాట్రన్‌లు రాజేందర్, చిరంజీవిరెడ్డి, మల్లారెడ్డి, సెక్రటరీ డాక్టర్ రత్నకుమార్, కోశాధికారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వసతులు కల్పించాలి

ఉప్పల్, డిసెంబర్ 29: ప్రజాపాలన కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ పరిధిలోని కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలని సీపీఎం ఉప్పల్ సర్కిల్ కమిటీ కార్యదర్శి ఎర్రం శ్రీనివాస్ శుక్రవారం ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసుకు వినతిపత్రం అందజేశారు. ఉప్పల్ డివిజన్‌లోని లక్ష్మీనారాయణకాలనీ, దేవేంద్రనగర్, జేవీకాలనీలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ కమిటీ సభ్యులు జె.వెంకన్న, స్వామి పాల్గొన్నారు.

## వైభవంగా మహాపడిపూజ

కాప్రా, డిసెంబర్ 29: కాప్రా డివిజన్ సాయిబాబానగర్ అయ్యప్పస్వామి దేవస్థానంలో శుక్రవారం అయ్యప్ప మహాపడిపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయం చైర్మన్ రేగళ్ల సతీష్ రెడ్డి, సోమాజి గురుస్వాముల ఆధ్వర్యంలో జరిగిన పడిపూజ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు హాజరయ్యారు.



కాప్రా వార్డు అధికారి విజయరాజుతో మాట్లాడుతున్న పరమేశ్వర్ రెడ్డి

## మ్యానిఫెస్టో హామీలను కాంగ్రెస్ నెరవేరుస్తది

**● ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి**

కాప్రా, డిసెంబర్ 29: ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందమల పరమేశ్వర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం కాప్రా డివిజన్ వార్డు కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు అందజేసే కేంద్రానికి విచ్చేసి దరఖాస్తులను సమర్పించే కార్యక్రమాన్ని కార్పొరేటర్ స్వర్ణరాజు శివమణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వారంలోపే ఆరు గ్యారంటీల్లో రెండు అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కాప్రా డివిజన్‌లో రెండు రోజుల్లో 2851 దరఖాస్తులు అందాయని కాప్రా డివిజన్ వార్డు కార్యాలయం అధికారి విజయరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంజిరెడ్డి, సుధాకర్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగశేషు, రాజు, శ్రీధర్, రామకృష్ణ, టిల్లు యాదవ్, నాగరాజ్, విఠల్, సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రెండోరోజూ.. అదే తీరు..

**● జిరాక్స్ సెంటర్ల దోపిడీపై ప్రజల అసహనం**

చర్లపల్లి, డిసెంబర్ 29: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'అభయ హస్తం' పథకం చర్లపల్లి, ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతుంది. మొదటి రోజు మాదిరిగానే రెండోరోజు కూడా పలుచోట్ల అధికారులు దరఖాస్తుదారులుకు సమాధానం చెప్పడంలో తడబడ్డారు. ప్రజలు సైతం అధికారులు తీరు, జిరాక్స్ సెంటర్ల దోపిడీపై అసహనం వ్యక్తం చేశారు. ఇక డివిజన్ల పరిధిలో స్థానిక కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డిలు అభయ హస్తం కేంద్రాలను సందర్శించి ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్నారు. ప్రజాపాలన కేంద్రాల్లో అవసరమైన దరఖాస్తు ఫారాంలు లేకపావడంతో ప్రజలు జీరాక్స్ కేంద్రాలను ఆశ్రయించారు. కొన్ని కేంద్రాల్లో తాగునీరు సౌకర్యం కల్పించకపాడంతో సిబ్బందితో పాటు దరఖాస్తుదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దరఖాస్తుదారుల సందేహాలకు అధికారుల నుంచి స్పష్టమైన సమాచారం లేకపావడంతో దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాపాలన కేంద్రాలకు వస్తున్న ప్రజలు ఎక్కువ శాతం నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసేందుకు రావడంతో రేషన్‌కార్డుల విషయంలో అధికారులు సమాధానం దాటవేస్తున్నారు. దీంతో కొంత మంది దరఖాస్తు చేయకుండా వెనుతిరుగుతున్నారు.

